సాక్షి అనంతపురం

శనివారం । 30 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.27,280

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27,280 పలికాయి.



టమాట కిలో రూ.33

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి ధర రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.


గరిష్టం/కనిష్టం

34.6°/14.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం పెరిగింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు నేమకల్లుకు ముఖ్యమంత్రి రాక





హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ

అనంతపురం అర్బన్/ బొమ్మనహాళ్: సీఎం చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు విచ్చేయనున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.20 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.25 గంటలకు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు. 1.55 గంటల వరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. 2 గంటలకు గుడికి వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. 2.05 నుంచి 3.05 గంటల వరకు లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. 3.15 నుంచి 3.45 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి బయలదేరి వెళతారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

నేమకల్లులో సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులతో కలిసి పర్యటించారు. హెలిప్యాడ్ స్థలాన్ని, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాన్ని, గ్రామసభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. మంత్రి కేశవ్ మీడియాతో మాట్లాడుతూ నేమకల్లులో నిర్వహించనున్న గ్రామసభ ద్వారా ఈ ప్రాంత సమస్యలు, ప్రజల మనోభావాలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: అర్హులైన ముస్లిం, క్రైస్తవ (బీసీ–సీ) సిక్కులు, బౌద్ధులు, జైన అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో ఎంప్యానల్ ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. డిసెంబర్ 12 లోగా www.apcedmmwd.org పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 0866–2970567 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

‘వీర’బాదుడు



అనంతపురం సెంట్రల్: బీసీసీఐ ఆధ్వర్యంలో మంగళగిరి వేదికగా శుక్రవారం జరిగిన అండర్ 19 కూచ్‌బెహార్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో జిల్లాకు చెందిన కేహెచ్ వీరారెడ్డి చెలరేగాడు. ఆంధ్ర, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 10 వికెట్లు కోల్పోయి 139 పరుగులు సాధించింది. అనంతరం బరిలో దిగిన ఉత్తరాఖండ్ జట్టు 10 వికెట్లు కోల్పోయి 85 పరుగులకు పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 10 వికెట్లు కోల్పోయి 337 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టాండ్‌బైగా దిగిన జిల్లాకు చెందిన వీరారెడ్డి వీరవిహారం చేశాడు. మైదానం నలుమూలాల బంతిని బౌండరీలు దాటిస్తూ 104 బంతుల్లో 106 పరుగులు సాధించాడు. టోర్నీలో రాణించిన వీరారెడ్డిని ఏడీసీఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందించారు.

ఎఫ్ఎస్ఓగా రామకృష్ణారెడ్డి



అనంతపురం అర్బన్: జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ జి.రామకృష్ణ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డీసీగా కె.మల్లికార్జునుడు, కేఆర్ఆర్సీ ఎస్డీసీగా డి.తిప్పేనాయక్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా వి.మల్లికార్జునరెడ్డి, హెచ్ఎల్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా జి.బి.సుబ్బారెడ్డి నియమితులయ్యారు. కాగా, జి.రామకృష్ణారెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన విషయం తెలిసిందే.

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఊరూరా ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు అధికారం చేపట్టాక హామీలు అటకెక్కించారు. ప్రజలు ఆయన మాటలు నమ్మి ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలనూ కూటమి పార్టీలకే కట్టబెట్టారు. పగ్గాలు చేపట్టి ఆరు మాసాలు పూర్తి కావస్తోంది. కానీ ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. సామాజిక భద్రత పింఛన్లకు కత్తెర వేయడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

సూపర్ మోసం



- అందని ‘తల్లికి వందనం’
- అన్నదాతా సుఖీభవ సాయం ఊసే లేదు
- మహిళలకు కలగానే ఉచిత బస్సు ప్రయాణం
- ఉద్యోగాల భర్తీ లేదు... నిరుద్యోగ భృతీ ఇవ్వలేదు
- కుంటుపడిన ఆరోగ్యశ్రీ, 108 సేవలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం చంద్రబాబునాయుడు శనివారం రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. కూటమి గెలుపునకు కారణమైన సూపర్ సిక్స్ పథకాల అమలును విస్మరించి జిల్లాకు వస్తున్న సీఎంపై జిల్లా వాసులు అసహనంతో ఉన్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా ఏటా రూ.15వేల చొప్పున ‘తల్లికి వందనం’ అందజేస్తామని ఇచ్చిన హామీకి ఇప్పటికీ దిక్కు లేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కలగానే మిగిలింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేకుంటే నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిన్న చిన్న ఇండస్ట్రీలు మూసివేయడంతో ఉన్న ఉద్యోగాలూ పోయాయి. 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.1,500 జమచేస్తామని ఇచ్చిన హామీ అమలు ఎప్పటి నుంచి అనేది ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. రైతులకు ఏటా రూ.20వేల పెట్టుబడి సాయం జమ చేస్తామని చెప్పి ఇప్పుడు దాని గురించే మాట్లాడటం లేదు. ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. చాలా మంది సిలిండర్ తీసుకుని రెండు వారాలు దాటినా బ్యాంకు ఖాతాలో డబ్బు జమ కాలేదు. ఇక ఆరోగ్యశ్రీ కుంటుపడింది. 108 సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

పేట్రేగిపోతున్న ‘కూటమి’ కార్యకర్తలు

సూపర్‌సిక్స్ హామీలు గాలికొదిలేసిన బాబు సర్కారు.. దౌర్జన్యాలు, భూ కబ్జాలతో తమ పార్టీల కార్యకర్తలు పేట్రేగిపోతున్నా చూస్తూ ఊరుకుంది. పోలీసులు నిశ్చేష్టులు కావడంతో శాంతిభద్రతలు గాల్లో దీపంలా మారాయి. మట్కా, పేకాట, గంజాయి వంటివి జిల్లా అంతటా కమ్ముకున్నాయి. గడిచిన ఆరు మాసాలుగా జిల్లాలో ఎప్పుడూ లేనంతగా గంజాయి దొరికింది. ఇక మద్యం గురించి చెప్పాల్సిన పనిలేదు. కొత్త మద్యం పాలసీ తెచ్చి ఊరూరా బెల్టుషాపులు పెట్టడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా మొత్తం నిషాలో మునిగి తేలుతోంది.

జిల్లాలో మహిళలకు నెలకు రూ.1500 పథకానికి అర్హులు	
18 ఏళ్లు నిండిన మహిళలు	10,20,124 మంది
18-60 ఏళ్ల మధ్య వయస్సు వారు	7,14,000 మంది
ఒక్కొక్కరికి ఇవ్వాల్సింది	రూ.1500
గడిచిన నెలకు ఇవ్వాల్సిన మొత్తం	రూ.107.10 కోట్లు

తల్లికి వందనం పథకానికి అర్హులు	
జిల్లాలో 1 నుంచి-ఇంటర్ విద్యార్థుల సంఖ్య	4,07,900
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య	2,10,008
ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల సంఖ్య	1,97,892
వీళ్లకు ఈ ఏడాది ఇవ్వాల్సిన మొత్తం	రూ.611.85 కోట్లు

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం	
జిల్లాలో అర్హులు	14,57,070
జిల్లాలో ఆర్టీసీ సర్వీసులు	491
హైర్ బస్సులు	105

అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులు	
జిల్లాలో వ్యవసాయ భూములు	5,28,753 హెక్టార్లు
ఎదురు చూస్తున్న రైతులు	2,90,899
తొలి ఏడాది ఒక్కొక్కరికి అందాల్సిన సాయం	రూ.20,000
ఈ ఏడాది రైతులకు ఇవ్వాల్సిన మొత్తం	రూ.581.79 కోట్లు

ఇంటికో ఉద్యోగం/ నిరుద్యోగ భృతికి అర్హులు	
జిల్లా జనాభా	22.40 లక్షలు
పీజీ, ఎంటెక్ చేసిన వారి సంఖ్య	78,000
డిగ్రీ, బీటెక్ చేసిన వారి సంఖ్య	1,62,000
టీటీసీ చేసిన వారి సంఖ్య	28,800
ఐటీఐ, డిప్లొమా వారి సంఖ్య	51,000
ఇతరత్ర విద్యార్హతలున్న వారు	2,10,000
మొత్తం నిరుద్యోగుల సంఖ్య	5,29,800
నెలకు అందాల్సిన భృతి మొత్తం	రూ.158.70 కోట్లు



ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన ప్రదేశం

ఈసారైనా నెరవేరేనా..?

- బీటీపీకి నీరు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంపై గంపెడాశలు



నేమకల్లు సమీపంలో పంట పొలాలపై కమ్ముకొంటున్న ఫ్యాక్టరీల పొగ

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సీఎం హోదాలో చంద్రబాబునాయుడు శనివారం మధ్యాహ్నం బొమ్మనహాళ్ మండలం నేమకల్లుకు వస్తున్నారు. గతంలో మాదిరిగా ఉత్తుత్తి హామీలు ఇవ్వకుండా.. వెనుకబడిన ప్రాంతాన్ని ఆదుకునేందుకు సరైన ప్రణాళిక అమలు చేయాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)ని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీ–నీవా జలాలతో నింపుతామని 2017లోనే చంద్రబాబు హామీ ఇచ్చారు. 2018లో వచ్చి బీటీపీ వద్ద రూ.అరకోటి విలువ చేసే పైలాన్‌ను ప్రారంభించి మొదటి ప్యాకేజీ కింద రూ.342 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే కాలువ పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నుంచి పోటీ చేసిన అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు కూటమి అధికారంలోకి రాగానే బీటీపీకి నీరిస్తామని ప్రచారం చేశారు. ఇదే విషయాన్ని చంద్రబాబు సైతం పునరుద్ఘాటించారు. నేమకల్లు పర్యటనలోనైనా బీటీపీకి నీరు వదిలే హామీకి మోక్షం లభిస్తుందా అని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఉంతకల్లు రిజర్వాయర్ రూపుదిద్దుకునేనా?

తుంగభద్ర ఎగువ కాలువకు అనుసంధానంగా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద ఐదు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని 2017లో గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత దాన్ని విస్మరించారు. రిజర్వాయర్ నిర్మిస్తే కరువు పీడిత రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఉంతకల్లు, నేమకల్లు, మల్లికేతి గ్రామాల మధ్య 46 ఎంసీఎఫ్‌టీ అంటే 0.046 టీఎంసీల సామర్థ్యం కలిగిన మైనర్ ఇరిగేషన్ ట్యాంకు ఉంది. దీనికి తుంగభద్ర డ్యాం నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వదిలే నీటిని సమాంతర కాలువ తవ్వి దాని ద్వారా తీసుకొచ్చి ఐదు టీఎంసీల నీటిని ఉంతకల్లులో నిల్వ చేయాలన్నది లక్ష్యం. మరి అతి తక్కువ కెపాసిటీతో ఉండే ఉంతకల్లు ట్యాంకులో 5 టీఎంసీల నీరు నిల్వ ఉంచాలంటే దానికి రెట్టింపు భూసేకరణ చేపట్టాలని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. విలువైన పట్టా భూములను రిజర్వాయర్ నిర్మాణం కోసం ఇచ్చేందుకు రైతులు అంగీకరించాల్సి ఉంది. రిజర్వాయర్ నిర్మాణం రూపుదిద్దుకునేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మా మొర ఆలకించండి

కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాలు ఖనిజ నిల్వలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు, కంకర క్వారీలు, స్టోన్ క్రషర్లు ఉన్నాయి. వాటి వల్ల వెలువడే దుమ్ము, ధూళి సాగు భూములపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కాలుష్యకాటుతో ప్రజలు కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. క్వారీల్లో తవ్వకాలు చేపట్టేందుకు ఉపయోగించే రసాయనాలు, బ్లాస్టింగ్‌లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మా మొర ఆలకించి న్యాయం చేయాలని ప్రజలు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నియోజకవర్గాన్ని ఆదుకోవాలి



ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్‌కు నిధులు ఇస్తేనే సరిపోదు. తుంగభద్ర బోర్డును ఒప్పించడంతో పాటు వేలాది ఎకరాల భూసేకరణ చేపట్టాలి. రిజర్వాయర్ నిర్మాణానికి మేం వ్యతిరేకం కాదు. రైతులను మభ్యపెట్టి మోసం చేస్తే ఊరుకునేది లేదు. బీటీపీకి నీరిస్తామన్నారు. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేకపోయారు. సీఎం హోదాలో తొలిసారి వస్తున్న చంద్రబాబు అన్నింటా వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గాన్ని ఆదుకోవాలి. అలాగే సూపర్‌సిక్స్ హామీలు ఎప్పటిలోగా నెరవేర్చుతారో ప్రజలకు తెలపాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్

- అదానీపై ఆరోపణలకు జగనన్నకు లింకేంటి?
- పనిగట్టుకుని దుష్ప్రచారం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం
- కూటమి ప్రభుత్వం మేలు చేసి ఉంటే ప్రజలకు తెలపాలని మీడియాకు సూచన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: హామీల అమలులో చతికిలపడిన ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం అనంతపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలకు రూ.74 వేల కోట్లు అవసరమైతే అందులో 10 శాతం మాత్రమే (రూ.7,400కోట్లు) బడ్జెట్‌లో కేటాయించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలనే అమలు చేయని పెద్దమనిషి రాష్ట్రానికి ఏం మేలు చేస్తారని నిలదీశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిందని, అందుకు అదానీ డబ్బులు పంచారని ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేశారని అన్నారు. ఏపీలో కాంగ్రెస్–బీ టీం అయిన టీడీపీ 2019–24లో రాష్ట్రంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ అదానీతో పీపీఏలుగా చిత్రీకరించారని, అదానీ నుంచి అప్పటి సీఎం జగన్ ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు చేశారని మండిపడ్డారు. దీనికి అమెరికాలో అదానీపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారన్నారు. అందులో ఎక్కడా వైఎస్ జగన్ పేరు లేదన్నారు. ఆరోపణల్లో వాస్తవం లేదని సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాదులందరూ కొట్టిపారేశారన్నారు. 2014–19లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఏపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు అప్పుల ఊబిలో మునిగిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.13వేల కోట్లు మాత్రమే సపోర్టు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో డిస్కమ్‌ల బలోపేతానికి రూ. 48వేల కోట్ల సాయం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో విండ్ పవర్ యూనిట్ రూ.4.80, సోలార్ రూ.5.90 తో కొనుగోలు చేస్తే, జగనన్న హయాంలో పీపీఏ చూస్తే రూ.2.49కే యూనిట్ విద్యుత్‌ను అందజేయానికి ‘సెకీ’ ముందుకు వచ్చిందన్నారు. రాబోయే 20 ఏళ్లు రైతులకు ఉచిత కరెంటు ఇవ్వాలని జగన్ సీఎంగా ఉన్న సమయంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ (పీపీఏ)లను రద్దు చేశారని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ‘సెకీ’ రూ.2.49కు విద్యుత్ ఇవ్వడానికి ముందుకు వచ్చిందని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వివరించారు. తద్వారా రూ.2 లక్షల కోట్ల సంపద సృష్టించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్ర రెవెన్యూ బలోపేతానికి కృషి చేస్తే నేడు చంద్రబాబునాయుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ జగన్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఎల్లో, సోషల్ మీడియాలు దుష్ప్రచారం మానుకుని ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన మేలు ఏదైనా ఉంటే ప్రజలకు చెప్పాలని సూచించారు.

జిల్లాకు న్యాయం చేయాలి

సాగునీటి విషయంలో జిల్లాకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రిని ఒప్పించాలని మంత్రులు, శాసనసభ్యులను తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు. హంద్రీ–నీవా ఫేజ్–1లో కాలువను రూ.800 కోట్లతో 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేస్తామని డీఆర్‌సీలో మంత్రి పయ్యావుల చెప్పిన మాటను స్వాగతిస్తున్నామన్నారు. ఫేజ్–2లో 400వ కిలోమీటర్ వరకు లైనింగ్ చేస్తామని చెబుతున్నారన్నారు. ఇందు కోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు అవుతుందని, భవిష్యత్తులో లైనింగ్ వద్దనుకుంటే భారీ నష్టం చేకూరుతుందని తెలిపారు. మడకశిర బ్రాంచ్ కాలువలో 640 క్యూసెక్కుల నీరు తీసుకోవాల్సి ఉండగా 300 క్యూసెక్కులు మాత్రమే తీసుకుంటున్నారని, కాలువను వెడల్పు చేయాలన్నారు. దేమకేతేపల్లి, చిలమత్తూరు, గోరంట్ల ప్రాంతాలకు డ్రింకింగ్ వాటర్ స్కీం రూ.700 కోట్లతో ఎమ్మెల్యే బాలకృష్ణ అంచనాలు వేశారని, అయితే ఇక్కడ 300 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో 250 క్యూసెక్కులతో కొత్త స్కీం తెస్తే ప్రాజెక్ట్ డీఫాల్ట్ అవుతుందన్నారు. పేరూరు డ్యాంకు ఒక టీఎంసీ జీఓ ఉందని, వెయ్యి క్యూసెక్కులకు వెడల్పు చేయడానికి రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని, కేవలం ఈ డబ్బుతో మడకశిర పెండింగ్ పనులు పూర్తవుతాయన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయులు, నారాయణరెడ్డి, గోవిందరెడ్డి, పవన్, నరసింహారెడ్డి, నరసింహగౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



తేలికపాటి వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల నాలుగు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడవచ్చని పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

అనంతపురం ఎడ్యుకేషన్/ అనంతపురం సెంట్రల్: బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం అనంతపురం పోక్సో ట్రయల్ కేసుల కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి కీలక తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2020 జూలై 3న మండల కేంద్రం పుట్లూరులో ఆరేళ్ల బాలికను ఇంటివద్ద వదిలి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటిముందు ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఇస్తానంటూ తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడు ఆశ చూపి తన ఇంట్లోకి పిలుచుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి తాడిపత్రి డీఎస్పీలు ఎ.శ్రీనివాసులు, బి.వెంకటశివారెడ్డి కేసు దర్యాప్తు చేశారు. అనంతపురం పోక్సో ట్రయల్ కేసుల కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 13 మంది సాక్షులను విచారించిన జడ్జి రాజ్యలక్ష్మి.. నేరం రుజువు కావడంతో ముద్దాయి తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడుకు జీవితఖైదుతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ. 10.50 లక్షలు (గతంలో రూ. 50 వేలు ఇచ్చారు) పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ కె.ఈశ్వరమ్మ వాదించారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి ముద్దాయికి శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ వెంకటేష్ నాయక్, పుట్లూరు సీఐ పి.సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది రాజు, చంద్ర, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసులు, కోర్ట్ హెచ్‌సీ ఎం.శ్రీనివాసులు, కోర్ట్ పీసీ ఈ.నాగార్జున, హెచ్‌సీ ఎ.లక్ష్మయ్యను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.



క్లుప్తంగా

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



డీఈఓ ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. కణేకల్లు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. నిర్దేశిత లక్ష్య సాధనకు స్టడీ అవర్స్ నిర్వహించాలని హెచ్‌ఎం ఫజులున్నీషాను ఆదేశించారు. 100 రోజుల ప్రణాళిక విజయవంతంగా కొనసాగించాలన్నారు. అనంతరం ఎమ్మార్సీని సందర్శించి పేరెంట్స్ కమిటీ సమావేశాలు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. కాగా, ఈ ప్రాంతానికి తొలిసారిగా వచ్చిన డీఈఓను ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్ తదితరులు ఘనంగా సన్మానించారు.

విద్యాశాఖ ఏడీ బదిలీ



నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ–2) వి.నాగరాజును పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన సమగ్ర శిక్ష ఏపీసీగానూ కొనసాగుతున్నారు. 2023, జూలై 20న ఏడీ–2గా విధుల్లో చేరిన నాగరాజు... కొన్ని రోజులు డీఈఓ (ఎఫ్ఏసీ)గానూ పని చేశారు. ఆయన బదిలీతో ఖాళీగా ఉన్న జిల్లా విద్యాశాఖ ఏడీ–2 పోస్టుకు ఎఫ్ఏసీగా కర్నూలు డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాజశేఖర్ బదిలీపై రానున్నారు.

శ్రీహరికోట స్పేస్ సెంటర్‌కు 3న ప్రత్యేక బస్సులు

రాయదుర్గం టౌన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో డిసెంబర్ 4న సాయంత్రం 4.08 తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ సి.59 రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రాయదుర్గం డిపో మేనేజ్ జె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3న రాత్రి 9 గంటలకు రాయదుర్గం నుంచి బస్సు బయలుదేరుతుంది. షార్‌తో పాటు పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల విహారకేంద్రం, సూళ్లూరుపేట చెంగాలమ్మ గుడిని చూసొచ్చే అవకాశాన్ని కల్పించారు. సూపర్ సర్వీసుకు ఒక్కొక్కరికి రూ.1,300, సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.1,800 చొప్పున రానూపోను చార్జీ నిర్ణయించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి కళాశాల రిజిస్ట్రేషన్ నంబర్లు, విద్యార్థుల వివరాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను డిపో మేనేజర్‌కు అందజేయాలి. మరింత సమాచారం, టికెట్ బుకింగ్ కోసం 99592 25863, 73828 63229లో సంప్రదించవచ్చు.

ప్రమోషన్ తీసుకో... ఉత్తర్వులు అడగొద్దు!

- ఇదీ కార్పొరేషన్, మునిసిపల్ స్కూళ్ల టీచర్ల పదోన్నతుల తీరు
- హెచ్‌ఎం పోస్టులకు పది రోజుల క్రితం ప్రమోషన్
- ఇప్పటి దాకా చేతికివ్వని ఉత్తర్వులు
- మునిసిపల్ ఆర్డీ వద్ద ఫైలు
- నాన్చుడు ధోరణిలోనే ఎస్జీటీల పదోన్నతులు



హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన టీచర్లతో డీఈఓ ప్రసాద్‌బాబు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: 'మీకు కావాల్సింది పదోన్నతులే కదా? అయితే తీసుకోండి! ఉత్తర్వులు మాత్రం అడగొద్దు' అనే రీతిలో ఉంది విద్యాశాఖ అధికారుల తీరు. కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్లల్లో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు ఇటీవల పదోన్నతులు కల్పించారు.పది రోజుల క్రితం ఇచ్చిన పదోన్నతులకు సంబంధించి ఇప్పటి వరకూ వారి చేతికి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈ పదోన్నతులపై త్రీమెన్ కమిటీ సభ్యులు డీఈఓ, మునిసిపల్ ఆర్డీ, ప్రాథమిక విద్య ఆర్జేడీ సంతకాలు చేయాల్సి ఉంది. కౌన్సెలింగ్ ముగిసిన రెండు రోజులకే విద్యాశాఖ నుంచి మున్సిపల్ ఆర్డీకి వెళ్లిన ఫైలు తిరిగి రాలేదు. రోస్టర్ పాయింట్ల సమస్య కారణంగా పెండింగ్ పెట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పొరుగు జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది.

ప్రభుత్వ ప్రకటన ఆర్భాటమే

కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు చేపట్టాలని కూటమి ప్రభుత్వ ప్రకటన ఆర్భాటంగానే మారింది. ఆచరణలో ఈ ప్రక్రియ మొత్తం నీరుగారిపోయింది. మున్సిపల్ స్కూళ్లు విద్యాశాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత తొలిసారి పదోన్నతులు చేపట్టారు. అనంతపురం కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు మరో యూనిట్‌గా పదోన్నతులను అధికారులు చేపట్టారు. ఈ నెల 6న హెచ్‌ఎం పదోన్నతులు, 8న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు కల్పిస్తున్నట్లు షెడ్యూలు కూడా విడుదల చేశారు. మున్సిపల్ స్కూళ్ల టీచర్ల వివరాలేవీ వీరి వద్ద లేకపోవడం, మున్సిపల్ ఆర్డీ నుంచి సరైన స్పందన లేకపోవడంతో పదోన్నతుల ప్రక్రియ కాస్త ఆలస్యమవుతూ వచ్చింది. సీనియార్టీ జాబితాలు తయారు చేసేందుకు విద్యాశాఖ సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వచ్చింది. పలుమార్లు మున్సిపల్ ఆర్డీ కార్యాలయం చుట్టూ తిరిగి చివరకు సీనియార్టీ జాబితా సిద్ధం చేశారు. ఆ తర్వాత ఈ నెల 20న హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించారు. కార్పొరేషన్ పరిధిలో ముగ్గురు, ముల్సిపల్ స్కూళ్లలో ముగ్గురు చొప్పున పదోన్నతి పొందారు. కానీ... ఉత్తర్వులు నేటికీ అందలేదు.

వీడని నాన్చుడు ధోరణి

అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ గందరోళంగా మారింది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. రోస్టర్ సమస్య తలెత్తడంతో ఇటీవల రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులు సవరించారు. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు చేపడతామని అంటున్నారు.

నేను సంతకం చేశా



కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్ల హెచ్‌ఎం పోస్టుల పదోన్నతుల ఫైలుపై నా సంతకం పూర్తయింది. మున్సిపల్ ఆర్డీ సంతకం చేసి పంపాల్సి ఉంది. రాగానే ఆర్జేడీకి పంపి ఒక్క రోజులోనే ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఎస్జీటీలకు సంబంధించి నెలకొన్న రోస్టర్ సమస్యను పరిష్కరించాం. రాష్ట్ర అధికారుల నుంచి అనుమతులు రాగానే ఆ పోస్టులకూ పదోన్నతులు కల్పిస్తాం.

– ఎం.ప్రసాద్‌బాబు డీఈఓ

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం



బాధితుడు రామచంద్రారెడ్డి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ నేత భీమునిపల్లి లక్కు రామచంద్రారెడ్డిపై శుక్రవారం టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... శుక్రవారం ఉదయం 11: 40 గంటలకు ద్విచక్ర వాహనంపై పొలానికి వెళుతున్న రామచంద్రారెడ్డిని హెచ్చెల్సీ 16వ కాలువపై లక్ష్మీనారాయణ చేను వద్ద చిన్నవడుగూరు గ్రామానికి చిరంజీవిరెడ్డి, చిరంజీవి మరో నలుగురు అడ్డుకుని దాడి చేశారు. అనంతరం పక్కలో ఉన్న కాలువలో పడేసి తలను నీటిలో ముంచి హతమార్చే ప్రయత్నం చేస్తూ తల వెనుకపై రాళ్లతో కొట్టి గాయపరిచారు. అదే సమయంలో అటుగా వచ్చిన రామచంద్రారెడ్డి బంధువులు వెంటనే టీడీపీ కార్యకర్తలను అడ్డుకుని క్షతగాత్రుడిని విడిపించారు. గాయాలపాలైన రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చికిత్స కోసం పామిడిలోని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



మంజునాథ్ (ఫైల్)

కంబదూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక కంబదూరు మండలం కురాకులపల్లికి చెందిన రైతు గొల్ల మంజునాథ్(40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకున్న ఐదు ఎకరాల పొలంలో టమాట, వేరుశనగ, మిరప తదితర పంటలను రైతు మంజునాథ్ సాగు చేసేవాడు. ఈ క్రమంలో పొలం పనుల కోసమని ఓ ట్రాక్టర్‌నూ కొనుగోలు చేశాడు. అయితే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయాడు. దీంతో పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.12 లక్షలకు చేరింది. దీనికి తోడు ట్రాక్టర్ కంతులు చెల్లించాలంటూ ఫైనాన్స్ కంపెనీ నుంచి తీవ్ర ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మనో వేదనకు లోనైన ఆయన శుక్రవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి బయటకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య శారదతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అప్పా ప్రిన్సిపాల్‌గా రఘువీరారెడ్డి బాధ్యతల స్వీకరణ

- నేడు ఉద్యోగ విరమణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రఘువీరారెడ్డి

అనంతపురం సెంట్రల్: ఏపీ పోలీసు ట్రెనింగ్ కళాశాల (అప్పా) ప్రిన్సిపాల్‌గా కె.రఘువీరారెడ్డి (ఐపీఎస్) నియమితులయ్యారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనను బదిలీపై అప్పా ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐగా పోలీసుశాఖలో చేరిన ఆయన పట్టుదలతో ఐపీఎస్ సాధించి ఉభయ గోదావరి జిల్లాల ఎస్పీగాను, సీఐడీ ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల సమయంలో నంద్యాల జిల్లా ఎస్పీగా ఉన్నారు. అనంతరం వెయిటింగ్‌లో ఉంటూ వచ్చిన ఆయనకు సర్వీసు ఆఖరు రోజున పోస్టింగ్ ఇవ్వడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్ఆర్ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, తదితరులు

బుక్కరాయసముద్రం: గ్లోబల్ ఐటీ కంపెనీ టీసీఎస్ ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఆ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్ఆర్ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి వెల్లడించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్) ఇటీవల నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన 138 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిలో ఇద్దరికి ప్రైమ్ ఆఫర్‌తో ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీ దక్కిందన్నారు. 21 మందికి ఏడాదికి రూ.7లక్షలు, 115 మంది రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. తమ కళాశాలలోని అన్ని బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. వీరిలో చాలా మంది ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్న వారే ఉన్నారన్నారు. తమ కళాశాలలో ప్రతి విద్యార్థికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థానాల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలి

- డీఈఓను కోరిన రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ విరమణ పొందిన, ఎఫ్ఏసీగా పని చేస్తున్న, లాంగ్ లీవ్‌లో ఉన్న టీచర్ల స్థానాల్లో వెంటనే సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారని గుర్తు చేశారు. అలాగే అనారోగ్య కారణాల వల్ల కొందరు లాంగ్‌లీవ్‌లోకి వెళ్లారన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు నష్ట పోకుండా తక్షణమే ఆయా స్థానాల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు మల్లి, రామకృష్ణ ఉన్నారు.

నీటి బొట్టు.. ఒడిసిపడితే ఒట్టు!

- ఇంకుడు గుంతల లబ్ధిదారుల గుర్తింపులో తీవ్ర జాప్యం
- మండలానికి వెయ్యి నిర్మించేలా టార్గెట్
- లక్ష్యసాధనలో యంత్రాంగం చతికిల



రాయదుర్గం డ్వామా కార్యాలయం వెనక నిర్మించిన ఇంకుడు గుంత

జిల్లాలో ఇంకుడు గుంతల లక్ష్యం	31,000
కమ్యూనిటీ సోఫ్‌పిట్స్	311
రూఫ్‌పార్ట్	460

రాయదుర్గం: భూగర్భ జలాల సంరక్షణే లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అలాగే, ఊరి చివర్లో కమ్యూనిటీ సోప్‌పిట్స్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా నిర్మాణాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఒక్కో గుంత నిర్మాణానికి సుమారు రూ.6 వేలు, కూలీలకు గాను రూ.600, ఇసుక, చిన్న, పెద్ద కంకరరాళ్లు, బొగ్గు ఇతర సామగ్రికి రూ.5,400 వెచ్చించాలని సూచించింది.

తీవ్ర నిర్లక్ష్యం..

ఇంకుడు గుంతల లక్ష్య సాధనలో ఉపాధి సిబ్బంది చతికిల పడ్డారు. జిల్లాలో మండలానికి వెయ్యి చొప్పున 31 వేల ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి. అయితే, లబ్ధిదారుల గుర్తింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ నుంచి మార్గదర్శకాలు వెలువడి నెల రోజుల పైనే గడిచినా కొన్ని మండలాల్లో సగం కూడా దాటలేదు. కొన్ని మండలాల్లో వీటి నిర్మాణాలపై దృష్టి సారించగా, మరికొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక.. ఊరి చివర్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు 311 మంజూరు కాగా 180 పురోగతిలో ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మంజూరైన 460లో 193 పూర్తి కాగా, మిగిలినవి వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి.

నిర్మిస్తే ప్రయోజనం..

ఒక క్యూబిక్ మీటరు గుంతలో వెయ్యి లీటర్ల నీటిని ఇంకించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణంతో 2,592 లీటర్ల నీరు భూమిలోకి ఇంకుతుంది. ప్రతి ఇంటి వద్ద నిర్మాణం చేపడితే లక్షల లీటర్ల నీటిని భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. గత ప్రభుత్వ హయాంలో 'వైఎస్సార్–జగనన్న' కాలనీల్లో నిర్మించిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు పెద్దపీట వేశారు. జిల్లాలో 435 జగనన్న కాలనీల్లో 70,740 మందికి స్థలాలిచ్చి ఇళ్లు కట్టించేలా చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాల కంటే ముందు ఇంకుడు గుంతలు పూర్తి చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం కూడా కొత్త నిర్మాణాలకు అనుమతి ఇచ్చే ముందు ఇంకుడు గుంత నిర్మాణం తప్పని చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోవడంలో సాధ్యమవుతుంది.

లక్ష్య సాధనకు కృషి



వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలు వృద్ధి చేసేలా ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. మండలానికి వెయ్యి చొప్పున తవ్వేందుకు ప్రతిపాదనలు పంపాం. ప్రతి మండలం నుంచి 400 నుంచి 500 వరకూ ఇంకుడు గుంతల తవ్వకానికి గుర్తించాం. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరగడంతో ఇళ్ల వద్ద స్థలాల సమస్య ఉంది. దీంతో లబ్ధిదారుల ఎంపికలో జాప్యం కపిస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్య సాధనకు కృషి చేస్తాం.

– ఎం. సలీమ్‌బాషా, డ్వామా పీడీ

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు

అనంతపురం కల్చరల్: దివ్యాంగులకు భారత వికాస పరిషత్తు ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు, దీర్ఘరోగాలతో దివ్యాంగులైన వారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు డిసెంబర్ 14వ తేదీ లోపు 'పరుచూరు రమేష్‌బాబు, శ్రీనివాస క్లాత్‌స్టోర్, రఘువీర టవర్స్ పక్కన, సుభాష్‌రోడ్డు, అనంతపురం' చిరునామాలో దరఖాస్తులందించాలి. పూర్తి సమాచారానికి 98495 08904లో సంప్రదించవచ్చు.

రైలు నంబర్లలో మార్పు

రాయదుర్గం టౌన్: రాయదుర్గం మీదుగా రాకపోకలకు సాగించే పలు రైళ్ల సర్వీస్ నంబర్లు 2025, జనవరి 1వ తేదీ నుంచి మారనున్నాయి. ఈ మేరకు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతి–కదిరిదేవరపల్లి రైలు (07589), కదిరిదేవరపల్లి–తిరుపతి (07590) ఇకపై 57405, 57406గా మారనున్నాయి. అలాగే గుంతకల్లు – చిక్కజాజూరు రైలు (07586), చిక్కజాజూరు–గుంతకల్లు రైలు (07585) ఇకపై 57415, 57416గా చలామణి కానున్నాయి. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు. కాగా, రాయదుర్గం మీదుగా నడిచే కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు పాక్షిక రద్దు గడువును రేపటి నుంచి 31వ తేదీ వరకూ పొడిగించారు. ఈ మేరకు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ అరవింద్ హర్లే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఈ రైలు గుంతకల్లు–తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగించనుంది.

ఔను... ఇది సచివాలయమే!



బ్రహ్మసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు అనుకూలంగా లేరంటూ ప్రభుత్వ అధికారులను బదిలీ చేయించడంతో పాటు... ఏకంగా ఆయా కార్యాలయాలకు పసుపు రంగు వేసి టీడీపీ కార్యాలయాలుగా మార్చేస్తున్నారు. బ్రహ్మసముద్రం మండలం సంతే కొండాపురం గ్రామ సచివాలయమే ఇందుకు నిదర్శనం. ఇటీవల గ్రామ సర్పంచ్ వనిత, స్థానిక టీడీపీ నాయకులు దగ్గరుండి సచివాలయానికి పసుపు రంగు వేయించారు. ప్రభుత్వ కార్యాలయానికి పసుపు రంగేయడం సబబు కాదని పలువురు హితవు పలికినా పెడచెవిన పెట్టారు. తమ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి ఆ పార్టీ రంగు వేస్తున్నామని చెప్పుకొచ్చారు.

దానిమ్మకు తెగులు... రైతుకు దిగులు



బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద రైతు మురళి సాగు చేసిన దానిమ్మ పంట

ఉద్యాన తోటల్లో ప్రధాన వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన దానిమ్మ తెగుళ్ల బారిన పడింది. ఓ వైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులే స్వయంగా ద్విచక్ర వాహనాలపై దిగుబడిని నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మరో వైపు బ్యాక్టీరియా మచ్చ తెగులు ప్రభావంతో కాయలో నాణ్యత తగ్గి కిలో రూ.50కు మించి ధర దక్కడం లేదు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



తెగుళ్లు సోకిన కాయలను చూస్తున్న రైతు మురళి

గ్రామాల్లో పశువుల అపహరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చిన్నపల్లి, హరియాన్‌చెరువు గ్రామాల్లో గురువారం రాత్రి పశువులను దుండగులు అపహరించుకెళ్లారు. స్థానికులు తెలిపిన మేరకు... చిన్నపల్లి గ్రామానికి చెందిన రైతు మాధవరాజులు గురువారం రాత్రి తన రెండు కోడెలను పశువుల పాకలో కట్టేసి ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాటిని దుండగులు వాహనంలో ఎక్కించుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. అలాగే హరియాన్‌చెరువు గ్రామానికి చెందిన రైతు బిల్లే లక్ష్మీనారాయణ పాడి ఆవునూ అపహరించారు. అదే గ్రామంలో మరో రైతుకు చెందిన ఆవులను తరలించే ప్రయత్నం చేస్తుండగా ఆ సమయంలో కియా కంపెనీలో పనిచేస్తున్న యువకులు అటుగా రావడంతో వాటిని వదలి దుండగులు పారిపోయారు. అపహరించిన పాడి ఆవు విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుంది. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం ఆయా గ్రామాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

క్లుప్తంగా

అరకొరగా మార్పులు, చేర్పులు

- ముగిసిన ఆధార్ క్యాంప్
- ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమెటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆధార్ కార్డు, పాఠశాల రికార్డుల్లో వివరాలు ఒకేలా ఉండాలి. వివరాలు సరిగా లేని వారికి ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 18 నుంచి ఆధార్ క్యాంప్ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకునేందుకు పోటెత్తారు. శుక్రవారంతో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ముగిసింది. ఇంకా చాలా మంది విద్యార్థులు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకోవాల్సి ఉంది. ఆధార్ శిబిరం ముగియడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు చోట్ల ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు వారి, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్: ప్రతి పరిశోధక విద్యార్థి ఒక కంపెనీ స్థాపించాలనే పట్టుదలతో పని చేయాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ ఎలక్ట్రికల్ విభాగం సెమినార్ హాల్‌లో 5 రోజుల పాటు జరిగిన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ.. విజన్ 2047, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను వివరించారు. రాబోయే కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఎలక్ట్రిక్ వాహనాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. కొత్త ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ రామశేఖరరెడ్డి, కో–ఆర్డినేటర్‌గా సుజాత, కో కో–ఆర్డినేటర్లుగా నాగభూషణం వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, విశాలి, కిరణ్మయి, అంకారావు, శ్రీనివాసులు, శ్రీధర్, శంకర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిజాలు మాట్లాడు 'దగ్గుపాటి'



మాట్లాడుతున్న పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మామూలుగా నిజాలు మాట్లాడరు.. కనీసం అయ్యప్ప మాల వేసుకున్న తర్వాత అయినా నిజాలు మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెన్నోబులేసు హితవు పలికారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 40 ఏళ్లలో జరగని అభివృద్ధి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో చేసేలా అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. రూ.1,050 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. నగరానికి దీటుగా ఏ.నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్ కాలనీ, అనంతపురం రూరల్ ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గత ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరంలో ఎంత అభివృద్ధి జరిగిందో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలన్నారు.

పట్టించుకోకపోతే.. ప్రాణాపాయమే

ఆత్మకూరులోని ఎస్సీ కాలనీలో దశాబ్దాల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంక్ ప్రమాదకర స్థితికి చేరుకుంది. శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. పిల్లర్లు పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను ధ్వంసం చేసి, నూతన ట్యాంక్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆత్మకూరులో కూలడానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్
- ట్యాంక్ ఆవరణలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ
- భయాందోళన చెందుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



ట్యాంక్ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల



అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఖాళీ చేసిన దృశ్యం





శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంక్ (ఇన్‌సెట్‌లో) నెర్రెలు చీలిన ట్యాంక్ పిల్లర్లు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ నీటి ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని చీలికలు వచ్చాయి. నీటి ట్యాంక్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల మూడు ఒకే చోట ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంక్ కింద ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి 16 మంది చిన్నారులు వస్తుండగా.. ఆ ట్యాంకు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకూ చదివే విద్యార్థులు 34 మంది ఉన్నారు. అధికారులు వెంటనే పట్టించుకోకపోతే పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఖాళీ..

ట్యాంక్ ప్రమాదకరంగా ఉండటంతో రెండు రోజుల క్రితం.. ట్యాంక్ కిందనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు ఖాళీ చేయించారు. వేరే ఇంటిని అద్దెకు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 'తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు'. మరుగుదొడ్లు కూడా ట్యాంక్ కిందనే ఉండటంతో విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు.

నూతన ట్యాంక్ నిర్మిస్తే మేలు..

ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న నీటి ట్యాంక్‌ను కూల్చి వేసి, కొత్త ట్యాంక్ నిర్మించాలని చాలా రోజులుగా ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ నూతన ట్యాంకు నిర్మిస్తే ప్రమాదం ఉండదని చెబుతున్నారు. తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆత్మకూరులోని ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉన్న విషయం వాస్తవమే. ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీఓకు లెటర్ పెట్టుకోవాలని ఉపాధ్యాయులకు సూచించాం. ట్యాంక్ కింద పాఠశాల ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు వివరిస్తాం. కాగా.. ఈ సమస్యను ఇప్పటికే మండల ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– నరసింహారెడ్డి, ఎంఈఓ, ఆత్మకూరు

ప్రమాదమని ఖాళీ చేయించాం



ట్యాంక్ కిందనే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి 16 మంది చిన్నారులు వస్తారు. ప్రస్తుతం ట్యాంక్ పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని చీలికలు వచ్చాయి. ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయించాలని నిర్ణయం తీసుకున్నాం. రెండు రోజుల క్రితం అంగన్‌వాడీ భవనాన్ని ఖాళీ చేశాం. పక్కనే ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని, అందులో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం.

– లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మేయర్ వసీం ఎద్దేవా చేశారు. శుక్రవారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలను ప్రశ్నిస్తే.. అక్రమ కేసులు నమోదు చేయడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితిలో వలంటీర్లు తమ కుటుంబాన్ని వీడి, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందించారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.60 లక్షల కోట్ల మంది వలంటీర్లు ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక రూ.10,000 ఇస్తామని చెప్పి వారిని మోసం చేశారన్నారు. స్వాతంత్య్ర ఆవిర్భావం నుంచి పార్లమెంట్‌లో బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నా.. పీఏసీ పదవి ఇచ్చారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 4 సార్లు ముఖ్యమంత్రి పదవి పలుమార్లు ప్రతిపక్ష నేతగా పని చేసిన చంద్రబాబు నాయుడు అందుకు భిన్నంగా రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పీఏసీ సభ్యుల ఎంపికకు కూటమి ప్రభుత్వం ఓటింగ్ నిర్వహించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. అధికారం కోసం వలంటీర్ వ్యవస్థను విమర్శించి, మళ్లీ ఓట్ల కోసం వారిని కొనసాగిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఆరు నెలల కాలంలో అరాచకాలు, అప్పులు, డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్ భూషణ్, నాయకులు కుళ్లాయి స్వామి, కాకర్ల శీన పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. డిగ్రీ, పీజీ చదువుకున్న యువకులు ఉద్యోగాలు రాక పొట్ట కూటి కోసం మీటర్ రీడర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికిప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వీరి పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు చిరంజీవి, ఏపీ మీటర్ రీడర్స్ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, సుబ్రహ్మణ్యం, సలీం, పవన్ కుమార్, దేవ తదితరులు పాల్గొన్నారు.

రేపు గాయకుల ఎంపిక

అనంతపురం రూరల్: రాయలసీమలో ఉన్న కళాకారుల ప్రతిభను వెలికి తీయాలన్న ఆలోచనతో డిసెంబర్ 1న గాయనీ, గాయకుల ఎంపిక చేపడుతున్నట్లు ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది కళాకారులకు సరైన వేదిక లేక తమలో ఉన్న ప్రతిభను నిరూపించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి ప్రతిభను వెలిక తీయాలన్న ఉద్దేశంతో నూరేళ్ల నా ఊరు కావ్యం పేరుతో డిసెంబర్ 1న స్థానిక ప్రెస్ క్లబ్‌లో గాయనీ, గాయకుల ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. 243 చరణాల గేయ కావ్యాన్ని 243 మంది గాయకులతో ఆలపించేందుకు గాయనీ, గాయకులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వాల్మీకి హరి, శివ, మహేష్ పాల్గొన్నారు.

నేడు గంగా హారతి

అనంతపురం కల్చరల్: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని శివస్వాముల ఆధ్వర్యంలో శనివారం గంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి ఆలయ వ్యవస్థాపకుడు బసవరాజ స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్చెల్సీ కెనాల్‌లో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి భస్మలింగార్చన, అష్టోత్తర పుష్పార్చన జరుగుతాయన్నారు. రాత్రి 7:10 గంటలకు భక్తులతో కలసి సామూహిక గంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఫలహార వితరణ ఉంటుందని తెలిపారు.

ఎస్‌ఐ విజయకుమార్ సేవలు ప్రశంసనీయం



బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ విజయ కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే ఎస్‌ఐ (జీఆర్‌పీ) విజయ కుమార్ విధి నిర్వహణలో అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. విజయ కుమార్‌ను బదిలీ చేస్తూ గుంతకల్లు రైల్వే ఎస్పీ ఉత్తర్వులు జారీ చేయగా.. ఆయన కర్నూలులోని రేంజ్ డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోనున్నారు. శుక్రవారం రాత్రి స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్‌లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీఆర్పీ సిబ్బంది, ఆర్‌పీఎఫ్ పోలీసులు మాట్లాడుతూ.. ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విజయకుమార్ అంకితభావంతో సేవలందించారన్నారు. సిబ్బందితో ఎంతో హుందాగా వ్యవహరిస్తూ అనేక కేసులను ఛేదించగలిగారని గుర్తు చేశారు. ఉద్యోగులకు బదిలీలు అనివార్యం కాగా.. ఎక్కడ పని చేసినా నిస్వార్థంగా పని చేసినప్పుడే పది కాలాల పాటు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోతారన్నారు. అనంతరం ఎస్‌ఐ విజయ కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

అనంతపురం రైల్వే ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే నూతన ఎస్‌ఐ (జీఆర్‌పీ)గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం రైల్వే ఎస్‌ఐగా పని చేస్తున్న ఈయన్ను అనంతపురానికి బదిలీ చేస్తూ గుంతకల్లు రైల్వే ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లును సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టిగా పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువద్దామని ఎస్‌ఐ తెలిపారు. అనంతరం గుంతకల్లు రైల్వే ఎస్పీని కలిసేందుకు బయలుదేరి వెళ్లారు.

జోరుగా రైల్వే ట్రాక్ పనులు

నగరంలోని రైల్వే స్టేషన్‌లో ట్రాక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో ట్రాక్ మధ్యలో కంకర వేయాల్సి వచ్చింది. రైల్వే అధికారులు గూడ్స్ వాహనం ద్వారా కంకరను తెప్పించారు. కంకర వేసే సమయంలో ఒక్కసారిగా దుమ్మూ, ధూళి స్టేషన్‌ను ఆవరించింది. పెద్ద ఎత్తున దుమ్ము లేచినా కార్మికులు తమ పనిలో నిమగ్నమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



గూడ్స్ ట్రైన్ నుంచి కంకరను డంప్ చేస్తున్న దృశ్యం



రైల్వే స్టేషన్‌ను కమ్మేసిన దుమ్ము



ట్రాక్ మధ్యలోకి కంకర వేస్తున్న దృశ్యం

ప్రమాదాల నియంత్రణకు 'ఫేస్ వాష్ అండ్ గో'

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎక్కువశాతం నిద్రమత్తులో జరుగుతుండటంతో గుత్తి–తాడిపత్రి జాతీయ రహదారిపై ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనాల డ్రైవర్లకు ముఖం కడుక్కుని.. టీ తాగమని అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 1,074 కేసులు నమోదు చేశారు. రూ. 2.02 లక్షల జరిమానా విధించారు. ఏటీఎం భద్రతలో భాగంగా 169 సెంటర్లను పర్యవేక్షించారు. బ్రహ్మసముద్రం, పామిడి పోలీసులు వేర్వేరుగా పేకాటరాయళ్లను అరెస్ట్ చేసి రూ.3,1410, గుంతకల్లు, వజ్రకరూరు పోలీసులు వేర్వేరుగా మట్కారాయళ్లను అరెస్ట్ చేసి రూ.25,360 స్వాధీనం చేసుకున్నారు.

4న ఘంటసాల సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు 102వ జయంతిని ఈసారి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 4వ తేదీ స్థానిక కల్లూరు సుబ్బారావు లలిత కళాపరిషత్తులో ఘంటసాల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌ఓ మలోల ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా పాటలను ఆలపిస్తారని తెలిపారు. కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



సత్తా చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాప్తాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురంలో జిల్లా స్థాయి త్రోబాల్ క్రీడా పోటీలు జరిగాయి. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్–17 విభాగంలో లోకరాజ్, లోహిత్ రాజు, లిఖిత, పవిత్ర, అండర్–14 విభాగంలో జోషియా బేగం, ప్రగతి నక్షత్ర, భరత్ కుమార్, వీరేంద్ర జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్–17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా, అండర్–14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం సాంబశివ, పీడీలు రాజశేఖర్ రెడ్డి, ఎస్.కేశవ మూర్తి, ఉపాధ్యాయులు నరసింహులు, కేశవయ్య, నల్లప్ప, అర్షద్, రోజా రమణి, జయలక్ష్మి, సీనియర్ క్రీడాకారులు ఆదినారాయణ, తరుణ్, ఓబులేష్, తోటి విద్యార్థులు అభినందించారు.

రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం



అలంకరణలో రామలింగేశ్వరుడు


అనంతపురం కల్చరల్: కార్తీక ఉత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. పవిత్ర కార్తీకంలో వచ్చిన మాసశివరాత్రి సందర్భంగా పలుచోట్ల మహాశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. స్థానిక నాలుగో రోడ్డులోని రామలింగేశ్వర ఆలయంలో మాసశివరాత్రి ఉత్సవం జరిగింది. ప్రధాన అర్చకులు నాగరాజ స్వామి, విజయసింహ స్వామి నేతృత్వంలో అన్నంతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు వితరణ చేశారు. అలాగే నగరంలోని శృంగేరీ శారదా శంకర మఠంలో 15 మంది అర్చకులతో శతరుద్రీయం నియమనిష్ఠలతో జరిపించారు. మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు, అర్చనలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మేనేజర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, మారుతీనగర్ కోదండ రామాలయ ప్రాంగణంలోని శివాలయంలో మాసశివరాత్రి వేడుకలు జరిగాయి.

మెగా పేరెంట్స్ మీట్‌కు సన్నద్ధం

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ మీట్ నిర్వహణకు అందరూ సన్నద్ధం కావాలని కనగానపల్లి ఎంఈఓ అరుణమ్మ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌పై శుక్రవారం కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి ఎంఈఓ కార్యాలయాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారం మాది.. మాకెందుకు అనుమతులు!

- కూటమి నాయకుల 'రియల్' వ్యాపారం
- అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటు
- పంచాయతీ ఆదాయానికి గండి
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు



వ్యాపారులు తయారు చేసిన వెంచర్‌కు సంబంధించిన స్కెచ్



కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలో అనుమతి లేకుండా వెలసిన వెంచర్

అనంతపురం రూరల్: 'అధికారం మాది మీమెందుకు అనుమతులు తీసుకుంటాం.. ఎవరొచ్చినా మమ్మల్ని ఏమీ చేయలేరు. ఏదైనా ఉంటే అన్నకు ఫోన్ చేస్తాం అన్నీ ఆయనే చూసుకుంటారు. మీకెందుకు మీరు ప్లాట్లు కొనుక్కోండి' అంటూ స్థానిక ఎమ్మెల్యే తనయుడి పేరు చెబుతూ కూటమి నాయకులు ప్రజలను మభ్యపెడుతూ రియల్ దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చిన్నంపల్లి పంచాయతీ బీసీ కాలనీ వద్ద దాదాపు 3 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే స్థలాలను విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఎక్కడైనా వెంచర్ ఏర్పాటు చేయాలంటే పంచాయతీ, అహుడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు ఏమీ లేవు. ల్యాండ్ కన్వర్షన్ కూడా చేయకుండానే వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పంచాయతీ, అహుడా నిబంధనల ప్రకారం వెంచర్ ఏర్పాటై ఉంటే పంచాయతీకి దాదాపు రూ.కోటి ఆదాయం సమకూరేది. అధికార బలంతో పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

నిబంధనలు బేఖాతరు..

చిన్నంపల్లి పంచాయతీ బీసీ కాలనీ దగ్గర కళ్యాణదుర్గం మెయిన్ రోడ్డులో సర్వే నంబర్ 133–1బీలో దాదాపు 3 ఎకరాల్లో కూటమి నాయకులు వెంచర్ ఏర్పాటు చేశారు. అయితే నిబంధనల ప్రకారం వెంచర్ ఏర్పాటు చేయాలంటే ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవడంతో పాటు పంచాయతీ, అహుడా అనుమతులు తీసుకోవాలి. అహుడా నిబంధనల ప్రకారం వెంచర్ ఏర్పాటు చేయాలంటే వెంచర్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, కరెంట్ సౌకర్యం, వీధిలైట్లతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలి. పంచాయతీకి ఎకరానికి పది సెంట్ల చొప్పున స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి వెంచర్ ఏర్పాటు చేయాలి. ఇక్కడ మాత్రం ఆ నిబంధనలేవి లేవు. పంచాయతీకి ఒక్క రూపాయి ఆదాయం సమకూరడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుంటే చర్యలు

వెంచర్ ఏర్పాటు చేయాంటే అహుడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తే చర్యలు తప్పవు. అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేస్తే పంచాయతీ కార్యదర్శులు అడ్డుకోవడంతో పాటు, అహుడా లేదా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత వారిదే. అనుమతులు లేని వెంచర్లలో స్థలాలను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి.

– నాగరాజు నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి